
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



• **పశ్చిమలో అపార గ్యాస్ నిక్షేపాలు**



పెనుగొండ, పెనుమంట్ర మండలాల్లో గ్యాస్ నిక్షేపాలను గుర్తించిన ఓఎన్‌జీసీ.. కాళ్ళ, భీమవరం రూరల్ మండలాల్లోనూ లోతైన అన్వేషణ చేస్తోంది. తాజాగా నరసాపురం మండలం సీతారాంపురంలో గుర్తించిన గ్యాస్ నిక్షేపాలను తరలించేందుకు పైప్‌లైన్ పనులను పూర్తి చేసింది. రానున్న రోజుల్లో యలమంచిలి, ఆచంట మండలాల్లో విస్తృత సర్వేలకు సన్నాహాలు చేపట్టింది. 7లో..

• **టీచర్ల అక్రమ బదిలీలు రద్దు**



కౌన్సెలింగ్‌తో నిమిత్తం లేకుండా సార్వత్రిక ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం చేపట్టిన టీచర్ల అడ్డగోలు బదిలీలు రద్దయ్యాయి. ఈ నిర్ణయం ఉమ్మడి జిల్లాలో 30 మంది టీచర్లపై ప్రభావం చూపనుంది. అయితే బదిలీ ఉత్తర్వుల రద్దుపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్టు సమాచారం. 7లో..

• **ఆపరేషన్ చేయకుంటే..**



ఈ యువతికి పేరు కోటం జ్ఞానేశ్వరి (14). తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈమెకు కామెర్లు ముదరడంతో రెండు రోజుల్లో లివర్ మార్పిడి చేయకుంటే ప్రాణాలకే ప్రమాదమని వైద్యులు ధ్రువీకరించారు. ఇందుకు రూ.40 లక్షల వరకు ఖర్చవుతుందని తేల్చారు. తల్లి భీమడోలు మండలం పోలసానిపల్లికి చెందిన ఏఎన్ఎం, తండ్రి రోజు వారీ వేతనంపై పనిచేస్తాడు. వీరి అంత మొత్తంతో వైద్యం చేయించే స్తోమత లేక దాతల సాయం అర్థిస్తున్నారు. 7లో..

• **ఫోన్‌లో పరిచయమయ్యాడని..**



ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. ఇంటి నుంచి వచ్చేయ్.. తాను చక్కగా చూసుకుంటానన్నాడు. అతగాడి మాటలు నమ్మి విజయనగరం నుంచి జంగారెడ్డిగూడెం బస్సు ఎక్కి వచ్చేసింది. రిసీవ్ చేసుకున్న అతగాడు.. మళ్లీ కనిపించలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీనిని గమనించిన మరో యువకుడు ఆమెకు మాయమాటలు చెప్పి మోసం చేశాడు. దీంతో ఆ యువతి కన్నీటి పర్యంతమై జంగారెడ్డిగూడెం పోలీసులను ఆశ్రయించింది. 7లో..

డెంగీ పేరిట భారీ వసూళ్లు

» 200 ఫస్ట్ ఎయిడ్ సెంటర్లకు నోటీసులు : ఏలూరు డీఎంహెచ్‌వో

ఏలూరు అర్బన్, జూలై 29: 'సీజన్ మార్పిడి సమయంలో సాధారణంగా వ్యాప్తి చెందే వైరల్ జ్వరాలను గ్రామీణ ప్రాంతాల్లోని కొందరు పీఎంపీలు, ఆర్‌ఎంపీలు, సాధారణ కాంపౌండర్లు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ప్లేట్‌లెట్ కౌంట్ పడిపోయినట్టు నమ్మబలుకుతూ దోచుకుంటున్నారు. డెంగ్యూ నిర్ధారణకు ఎటువంటి వైద్యపరమైన హక్కులు లేని పీఎంపీలు, ఆర్‌ఎంపీలు నిర్వహిస్తోన్న 200 ఫస్ట్ ఎయిడ్ సెంటర్లకు నోటీసులు జారీచేశాం' అని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శర్మిష్ట పేర్కొన్నారు. 'హైపవర్ యాంటీ బయోటిక్స్ వాడిన తర్వాత టెస్ట్ చేస్తే డెంగీ నెగెటివ్ ఉన్నా, ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గుతుంది. దీన్ని సాకుగా చూపి డెంగీ వచ్చిందని పీఎంపీలు, ఆర్‌ఎంపీలు ప్రజలను భయపెట్టి వేలకు వేలు వసూలు చేస్తున్నారన్నారు. చాట్రాయి మండలం చనుబండలో ఎక్కువ మంది ప్రజలు సీజనల్ జ్వరాలు, ఒంటి నొప్పులతో బాధపడుతున్నారు. దీనిపై మంత్రి పార్థసారథి ఆదేశాల మేరకు సోమవారం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌వో పర్యటించి వైద్యులకు పలు సూచనలు చేశారు.

జ్వరంతో మహిళ మృతి

చనుబండలో వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్న కంచు రామపుల్లమ్మ(33) విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. జ్వరం వచ్చిన తర్వాత నాలుగు రోజులపాటు స్థానిక వైద్యుడి వద్ద చికిత్స పొందినా తగ్గకపోవడంతో కుటుంబ సభ్యులు విస్సన్నపేటలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో ఆదివారం విజయవాడ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

గడ్డకట్టిన.. నిర్లక్ష్యం !

» నాడు-నేడులో కనిపించని అభివృద్ధి
» పనికిరాని సిమెంట్.. తుప్పుపట్టిన ఇనుము
» దిబ్బలపల్లవపాలెం ప్రాథమిక పాఠశాలలో వృథాగా బిల్డింగ్ మెటీరియల్

మొగల్తూరు, జూలై 29 : గత ప్రభుత్వ హయాంలో పాఠశాల అభివృద్ధికి చేపట్టిన నాడు-నేడు పనుల్లో నిర్లక్ష్యం తొంగిచూసింది. ఫలితంగా లక్షల విలువైన మెటీరియల్ నిరుపయోగంగా మారింది. పేరుపాలెం సౌత్ పంచాయతీ పరిధిలోని దిబ్బల పల్లవపాలెం మండల పరిషత్ పాఠశాల రెండో విడత నాడు-నేడులో ఎంపికైంది. విద్యార్థులకు మరుగు దొడ్డి, స్కూల్ ప్రహరీ గోడ, మంచినీటి సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరుచేసింది. తొలి విడత రూ.12 లక్షలు నిధులు రెండున్నరేళ్ల క్రితమే విడుదల చేశారు. ఆ సమయంలో మరుగుదొడ్డి, స్కూల్ ప్రహరీ కొంత మేర నిర్మించి మిగిలిన పనులు నిలిపివేశారు. ఈ నిర్మాణాలకు కొనుగోలు చేసిన 60 బస్తాల సిమెంట్ పాఠశాల వంట గదిలో నిల్వ ఉంచారు. రెండేళ్లుగా అలా ఉంచేయడంతో ఆ బస్తాలు గడ్డకట్టి నిరుపయోగంగా మారాయి. స్కూల్ ప్రహరీ గోడ నిర్మాణం మధ్యలో వదిలి వేయడంతో నిర్మాణానికి కొనుగోలు చేసిన ఇనుప ఊసలు స్కూల్ ప్రాంగణంలో ఆరు బయట ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ ఉండటంతో ఊసలు తుప్పు పట్టాయి. ఇక నిర్మాణానికి కొనుగోలు చేసిన కంకర, గోదావరి ఇసుక, ఇటుకలు చిందర వందరగా ఉన్నాయి. విద్యార్థుల తాగు నీటి అవసరాలకు చేపట్టాల్సిన మంచినీటి ట్యాంకు నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. అభివృద్ధి పనులు పూర్తి చేయకపోవడంతో నిర్మాణ సామగ్రి నిరుపయోగంగా మారింది. వంట గదిలో సిమెంట్ బస్తాలు ఉండటంతో విద్యార్థులకు ఆహారం తయారీకి వంట ఏజెన్సీ సభ్యులు ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధి నిలిచిపోవడం, మెటీరియల్ వృథాగా మారడంతో ఆవేదన చెందుతున్నారు.

నిర్మాణం పూర్తి చేయాలి

ఆ సమయంలో ప్రధానోపాధ్యాయుడు ఇంజేటి హర్ష శ్రీకాంత్‌ను వివరణ కోరగా తాను డిప్యూటేషన్‌పై 'దిబ్బలపల్లవపాలెం స్కూల్‌లో ఏడు మాసాలు పనిచేశానని ఆ సమయంలో టాయ్‌లెట్, ప్రహరీ కొంత నిర్మించారు. పాత వాటర్ ట్యాంకును తొలగించి కొత్తది నిర్మించాల్సి వుంది.



సిమెంట్ బస్తాలు

ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్లో ఇంకా రూ.70 వేలు ఎస్ఎంసీ ఖాతాలో ఉన్నాయి. నా డిప్యుటేషన్ ముగియడంతో తెన్నేటిపేట స్కూల్‌కు వచ్చేశా' అని వివరించారు. 'ఈ పాఠశాలలో పనులు చేయకపోవడంతో సిమెంట్ గడ్డ కట్టింది. ఇనుప ఊసలు తుప్పు పట్టాయి. మెటల్ రాళ్లు ఛిద్రమవుతున్నాయి. విద్యార్థుల అవసరాలు గుర్తించి పాఠశాల అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి' అని మాజీ వైస్ ఎంపీపీ అంద్రాజు రామన్న కోరుతున్నారు.

వరద తగ్గినా అదే ఉధృతి



యలమంచిలిలంక వరద నీటిలోనే గ్రామస్థుల రాకపోకలు

కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక

» మహారాష్ట్రలో భారీ వర్షాలు.. పొంచివున్న ముప్పు.. ముంపులోనే లోతట్టు ప్రాంతాలు
» నీట మునిగిన మాచేనమ్మ ఆలయం
» నరసాపురంలో మునిగిన రేవులు



నీట మునిగిన పెదమల్లం మాచేనమ్మ ఆలయం

కుక్కునూరు/వేలేరుపాడు/పోలవరం/ఆచంట/యలమంచిలి/నరసాపురం టౌన్, జూలై 29: ఉగ్రరూపం దాల్చిన గోదావరి సోమవారం మధ్యాహ్నం నుంచి శాంతించింది. వరద తగ్గుముఖం పట్టినప్పటికి ఉధృతి మాత్రం తగ్గలేదు. భద్రాచలం వద్ద సోమవారం ఉదయం 45.40 అడుగుల నీటిమట్టం ఉండగా సాయంత్రానికి 43.10 అడుగులకు చేరింది. రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. శబరి నది ఎగపోటు కారణంగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గోదావరి నెమ్మదిగా తగ్గుతోంది. మహారాష్ట్రలోని గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు భారీగా వరద చేరుకుంటోందని దాని ప్రభావంతో తిరిగి గోదావరికి వరద పోటెత్తే ప్రమాదం ఉందని ముంపు మండలాలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. వేలేరుపాడు మండలంలోని 30 గ్రామాలు జల దిగ్బంధంలోనే ఉన్నాయి. ముంపునకు గురైన ఇళ్లల్లో పేరుకున్న బురదను తొలగించే పనిలో ఆయా గ్రామాల ప్రజలు నిమగ్నమయ్యారు. కుక్కునూరు మండలం వింజరం వద్ద గోదావరి వరద తగ్గడంతో భద్రాచలం వైపు రాకపోకలు ప్రారంభమయ్యాయి. పోలవరంలో గోదావరి నీటిమట్టం 24.337 మీటర్లకు చేరుకోగా 11,78,184 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 33.460 మీటర్లు, దిగువన 25.200 మీటర్లు నమోదైంది. పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 17 పంపులు ద్వారా 6,018 క్యూసెక్కుల గోదావరి వరద జలాలు దిగువకు విడుదల చేశారు. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 15.02 మీటర్లకు చేరుకోగా, 14,71,000 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేశారు. రెండో ప్రమాద హెచ్చరిక అమలులో ఉంది.

దెబ్బతిన్న పంటలు.. వశిష్ఠకు వరద పోటు

ఆచంట మండలం అయోధ్యలంక, పెదమల్లం లంక, కోడేరు లంకలు ముంపు నుంచి బయట పడకపోవడంతో అన్ని రకాల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పెదమల్లం మాచేనమ్మ ఆలయం నీట మునిగింది. వరద ఉధృతి ఎక్కువగా వున్న కారణంగా గోదావరిలో పడవల రాకపోకలు నామ మాత్రంగా జరుగుతున్నాయి. వరద పరిస్థితిని తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీవో నరసింహప్రసాద్, పోలీసు అధికారులు పర్యవేక్షించారు. యలమంచిలి మండలం కనకాయలంక, పెదలంక, యలమంచిలి లంక గ్రామాల ప్రజలు వరద నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. వశిష్ఠ గోదావరికి వరద పోటు తగ్గకపోవడంతో నరసాపురం పట్టణంలోని వలందర్ రేవు, లలితాంబ, కొండాలమ్మ రేవులు నీట మునిగాయి. పట్టణం నుంచి గోదావరిలోకి వెళ్లే డ్రైనేజీని మూసివేయడంతో మురుగు నీరు బయటకు వెళ్లడం లేదు. చలవపేట, పొన్నపల్లి, శ్రీహరిపేట కాలనీ, కుళాయి చెరువు వద్దకు నీరు నిల్వ ఉండిపోయింది. మండలంలోని ఎస్టీ కాలనీలో మోకాలు లోతు వరద నీరు చేరింది. మార్కెట్ యార్డు మైదానం వరద నీరుతో మునిగింది. పంట కాల్వలోకి వరద నీరు చేయడంతో కాల్వ లీకేజీల గుండా నీరు పల్లపు ప్రాంతాలకు చేరింది. వందలాది ఎకరాలు చెరువులను తలపిస్తున్నాయి.



యలమంచిలి మండలం లక్ష్మీపాలెం పల్లిపాలెంలో చేరిన వరద నీరు



పోడూరు మండలం వద్దిపర్రులో వరద బాధితులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు 7లో..

వీరికి ఏవీ లైఫ్ జాకెట్లు

ఆచంట, జూలై 29 : ఏటా జూలై, ఆగస్టు నెలల్లో గోదావరి ఉగ్రరూపం దాల్చడం.. లంకగ్రామాలు ముంపుబారిన పడటం జరుగుతూ వుంటుంది. వీటిని పరిశీలించేందుకు, ప్రజల యోగ క్షేమాలు తెలుసుకునేందుకు ఉద్యోగులు నిరంతరం ఆయా రేవుల నుంచి పడవలపై లంక గ్రామాలకు వెళ్లి సేవలందిస్తారు. అయితే వరద ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఎటువంటి లైఫ్ జాకెట్లు లేకుండా పడవ ప్రయాణం చేయకూడదని సంబంధిత అధికారులే చెబుతుంటారు. అయితే ఎప్పుడూ లైఫ్ జాకెట్లు లేకుండానే ఉద్యోగులు పడవలపై వెళుతున్నారు. దీనిపై వారు ఆందోళన చెందుతున్నారు. తమకు కూడా వీటిని అందజేయాలని పలువురు ఆంధ్రజ్యోతి దృష్టికి తీసుకువచ్చారు.



వరద నీటిలో బైక్.. తృటిలో తప్పిన ప్రమాదం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 29 : మాధవరం-కంసాలిపాలెం మధ్యలో ఎర్ర కాలువపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. సోమవారం కొందరు యువకులు కంసాలిపాలెం వెళ్లేందుకు వంతెన వైపు వెళ్లే ప్రయత్నం చేశారు. వరద నీటి ప్రవాహ తీవ్రత ఎక్కువగా ఉండడంతో బైక్ పక్కకు లాగేసింది. ఆ వెంటనే బైక్‌పై వెళుతున్న యువకులు అప్రమత్తమై కిందకు దూకేశారు. ఆపై బైక్‌ను బ్యాలెన్స్ చేసే ప్రయత్నం చేశారు. అయినా అది కొట్టుకుపోతుండటంతో అక్కడే వున్న స్థానికులు అక్కడకు వచ్చి బైక్‌ను, వారిని వెనక్కు లాగడంతో పెద్ద ప్రమాదం తప్పింది.



ఆచంట పెదమల్లంలో వరద



నరసాపురంలో నీట మునిగిన ఏఎంసీ మైదానం

నీరు గారిన చెట్టు

జిల్లాలో రూ. 40 కోట్ల బిల్లుల కొర్రీ

» వైసీపీ ప్రభుత్వంలో కానరాని పథకం
» కూటమి ప్రభుత్వం రాకతో బడ్జెట్ కేటాయింపుపై కాంట్రాక్టర్లలో చిగురించిన ఆశ

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 29 : నీరు-చెట్టు పథకం పనులు చేసిన కాంట్రాక్టర్లలో కూటమి ప్రభుత్వం రాకతో ఆశలు చిగురించాయి. గతంలో యుద్ధ ప్రాతిపదికన మురుగు బోదెలు, చెరువులను తవ్వకాలు చేపట్టిన ఈ పథకం ద్వారా భారీ ఎత్తున పనులు చేపట్టారు. ఆ పనులకు సంబంధించి బిల్లులు చెల్లించకపోవడంతో నీరు చెట్టు పనులు చేపట్టిన కాంట్రాక్టర్లంతా బిల్లులు రాక అల్లాడిపోయారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పనులన్ని టీడీపీ నాయకులు భోంచేశారంటూ బూచిగా చూపి ఆ పనులకు బిల్లులు విడుదల చేయలేదు సరి కదా ఈ పనులు మాట చెబితేనే కాల్చేసే విధంగా వైసీపీ ప్రజా ప్రతినిధులు వ్యవహరించారు. దీంతో తాము చేసిన పనులకు బిల్లులు రాక చేసిన అప్పులకు కాంట్రాక్టర్లు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ప్రస్తుతం రాష్ట్రంలో మళ్లీ కూటమి ప్రభుత్వం రావడంతో ఆ కాంట్రాక్టర్లలో ఆశలు చిగురించాయి. తాము చేసిన పనులకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయిస్తే తాము ఏళ్ల పాటు నిరీక్షించిన బిల్లులు వస్తాయని ఆశతో ఎదురు చూస్తున్నారు. ఏల్లాలో ఈ బాపతు రూ.40 కోట్ల వరకూ బిల్లులు రావాల్సి ఉంటుంది. ఏళ్ల తరబడి సిల్ట్‌తో పేరుకుపోయిన చెరువులకు ఈ నీరు చెట్టు పథకం ఊతం ఇచ్చింది. ఇటు చెరువుల్లో పేరుకుపోయిన సిల్ట్‌తోపాటు కొట్టుకుపోయిన గట్లు, ఆక్రమణలు తొలగించి అన్నింటికి ఈ నీరు చెట్టు పథకం ద్వారా అభివృద్ధి చేశారు. దీంతో గ్రామాల్లోని చెరువులు ఈ పథకం ద్వారా అభివృద్ధి చేయడం ద్వారా ఆయకట్టుకు నీరు అందించడంతోపాటు పంచాయతీల్లో చెరువుల చేపల పెంపకానికి ఊతం లభించింది. దీంతో గ్రామ పంచాయతీల్లో చేపల చెరువుల వేలం రికార్డు స్థాయిలో ఆదాయం లభించింది.

ఓ బూచిగా చూపించే ప్రయత్నం

టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన నీరు చెట్టు పథకం తొలి నుంచి వైసీపీ ప్రభుత్వం ఓ బూచిగానే చూపిస్తూ వచ్చింది. ఈ పథకంలో టీడీపీ నాయకులు మట్టిని అమ్ముకున్నారంటూ ప్రచారం చేయడంలో సఫలమైంది. కానీ ఆ మట్టితో కల్వర్టుల నిర్మాణం, స్మశాన వాటికల పూడిక, ప్రభుత్వ స్థలాల మెరక తదితర పనులు చేపట్టారు. కొంత మేర బయటకు వెళ్లిన మాట వాస్తవమే అయినా అందుల్లో అధిక శాతం పూడికలు చేపట్టారు. ఆ పనులకు సంబంధించి జిల్లాలో ఈ పథకం ద్వారా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు రూ.40 కోట్ల మేర బిల్లులు నిలుపుదల చేయడంతో ఐదేళ్లుగా అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ బిల్లుల కోసం కోర్టులను ఆశ్రయించారు. కాని, ఆ బిల్లులు అధిక శాతం పెండింగ్‌లో ఉండటంతో కాంట్రాక్టర్లంతా బిల్లుల కోసం ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నారు.

బడ్జెట్ కోసం ఆశగా..

గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన నీరు-చెట్టు పనులకు వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి హామీ ఇవ్వకపోగా ఆ పనులను ఓ దోపిడీగా చిత్రీకరించారు. దీంతో ఆ ఐదేళ్ల బిల్లుల కోసం అడిగేందుకే సాహసించలేదు. చివరికి కోర్టులో వేసినా అందులో పది శాతం బిల్లులే వచ్చాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే ఈ నీరు చెట్టు పెండింగ్ బిల్లులు వస్తాయన్న ఆశ కాంట్రాక్టర్‌లు వ్యక్తం చేస్తున్నారు.



ఐదు లక్షలు రావాలి



మా గ్రామంలో నీరు చెట్టు పథకం ద్వారా నాలుగు చెరువులకు పనులు చేయించాం. నేను రెండు చెరువులు తవ్వించి ఆ మట్టిని స్మశాన వాటిక పూడికతోపాటు, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని మెరకచేశాం. వైసీపీ ప్రభుత్వంలో ఈ బిల్లులు ఇవ్వలేదు. మేం చేసిన పనులపై క్వాలిటీ కూడా చెక్ చేశారు. నాకు రూ.5 లక్షల బకాయిలు ఉన్నాయి. ఐదేళ్లుగా వాటికి వడ్డీలు చెల్లించడానికే సరిపోయింది. కూటమి ప్రభుత్వంలో అయినా బిల్లులు వస్తాయని ఆశిస్తున్నాం.

- కౌలూరి పరిమళ, మాజీ సర్పంచ్ మాధవరం

తహసీల్దార్లు రిలీవ్

భీమవరం, జూలై 29(ఆంధ్రజ్యోతి): బదిలీ అయిన తహసీల్దార్లు తమ సొంత జిల్లాలకు వెళ్లిపోయారు. వారిని రిలీవ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. వరద ప్రభావిత ప్రాంతాలైన ఆచంట, యలమంచిలి, నరసాపురం మండలాల తహసీల్దార్లను రిలీవ్ చేయలేదు. ప్రస్తుతం వారందరూ వరద సహాయక చర్యలలో పాల్గొంటున్నారు. భీమవరం, తాడేపల్లిగూడెం డివిజన్ల పరిధిలోని 12 మండలాల తహసీల్దార్లంతా రిలీవ్ అయ్యారు. వారి స్థానంలో ఎన్నికల ముందు ఇతర జిల్లాలకు వెళ్లిన వారందరూ తమ సొంత స్థానాల్లో చేరనున్నారు. ఇప్పటికే వారందరికి పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. నర్సాపురం డివిజన్ పరిధిలో మొగల్తూరు, పెనుమంట్ర, పాలకొల్లు, పోడూరు, పెనుగొండ మండలాల తహసీల్దార్లు రిలీవ్ కానున్నారు.

వైద్యుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

భీమవరం టౌన్, జూలై 29: గ్రామీణ ప్రాంతాల్లో ఐదేళ్లుగా సేవలందిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారులకు పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ఇన్ సర్వీస్ కోటాను కొనసాగించాలని కోరుతూ జిల్లా పీహెచ్‌సీ వైద్యుల సంఘం ప్రతినిధులు కలెక్టర్ చదలవాడ నాగరాణిని కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆమెను కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావుకు వినతిప్రతం అందించారు. రాష్ట్రవైద్యుల సంఘం జాయింట్ సెక్రెటరీ డాక్టర్ కిషోర్, డాక్టర్ సి.రంగంనాయుడు వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పీహెచ్ ఆర్ సంతోష్ పాల్గొన్నారు.



చినవెంకన్న క్షేత్రంలో డాగ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

ద్వారకాతిరుమల, జూలై 29: ద్వారకాతిరుమల క్షేత్రంలో సోమవారం డాగ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేశారు. ఆలయ పరిసరాలు, ప్రాంగణం, మండపాలు యాత్రికులు అధికంగా సంచరించే ప్రాంతాల్లో తనిఖీలను చేపట్టారు. హెచ్‌సీ సుగుణారావు వీరా సర్ పేరుతో ఉన్న డాగ్‌తో తనిఖీ నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్ బృంద సభ్యులు ఎస్.ఆంజనేయులు తనిఖీల్లో పాల్గొన్నారు. ప్రధాన ఆలయాల తనిఖీల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు బృంద సభ్యులు తెలిపారు.

సెల్‌ఫోన్ కౌంటర్ వేలం ద్వారా రూ.50 లక్షల ఆదాయం



ద్వారకాతిరుమల, జూలై 29: ద్వారకాతిరుమల శ్రీవారికి సెల్‌ఫోన్ కౌంటర్ ద్వారా ఏడాదికి రూ. 50 లక్షల మేర ఆదాయం లభించింది.పాదుకా మండపం వద్దనున్న పాత కల్యాణమండప ఆవరణలో సోమవారం ఆలయానికి వచ్చే భక్తుల సెల్‌ఫోన్‌లను భద్రపరిచే హక్కుకు ఏడాది కాలానికి జరిగిన బహిరంగ వేలంలో గ్రామానికి చెందిన సీహెచ్ రాజేష్ రూ.50 లక్షలకు పాడాడు. గతంలో రెండేళ్ల కాలానికి రూ. 19.9 లక్షలు ఆదాయం రాగా ఇప్పుడు ఏడాదికి భారీ స్థాయిలో ఆదాయం లభించింది. ఈ ఏడాది అక్టోబరు 6 వరకూ పాత పాటదారుడికి కాలం ఉండగా కొత్త పాట దారుడు అక్టోబరు 7 నుంచి హక్కు పొందుతాడు.



కనకదుర్గమ్మకు సారె అందించేందుకు వెళ్తున్న అధికారులు, అర్చకులు

విజయవాడ దుర్గమ్మకు స్వామివారి ఆషాఢం సారె

ద్వారకాతిరుమల, జూలై 29: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనక దుర్గమ్మకు ద్వారకాతిరుమల దేవస్థానం తరఫున ఆషాఢ మాస సారెను సోమ వారం అందజేశారు. ద్వారకాతిరుమల నుంచి అధికారులు, అర్చకులు అక్కడకు వెళ్లి అమ్మవారికి సారెగా పట్టుచీర, పూలు, పండ్లు, స్వీట్లు అందజేశారు. ముందుగా ఆలయ ఏఈవో మెట్టపల్లి దుర్గారావు, ప్రధాన అర్చకులు పెద్దింటి భాను, ఉప ప్రధానార్చకులు కొండూరి జనార్ధనాచార్యులు తదితరులు విజయవాడ వెళ్లి అమ్మవారికి సారె అందించి ప్రత్యేక పూజలు చేశారు. ఇంద్రకీలాద్రి దేవస్థానం ఈవో రామారావుకు చినవెంకన్న ప్రసాదం, చిత్రపతం ఇచ్చి సత్కరించారు.

పటిష్టమైన ప్రణాళికలతోనే అంకుర పరిశ్రమల అభివృద్ధి

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 29 : అంకుర పరిశ్రమలు అభివృద్ధి చెందాలంటే పటిష్టమైన ప్రణాళికలు , వ్యూహాలను కల్గి ఉండాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ (ఐఐఎం విశాఖపట్నం) అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సమీమ్ జావెద్ అన్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరక్టర్ డాక్టర్ ఎంఎస్‌మూర్తి ఆధ్వర్యంలో, రిజిస్ట్రార్ డాక్టర్ పీ.దినేష్ శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సౌజన్యంతో ఏంజెల్ ఇన్వెస్ట్ మెంట్ వీసీ ఫండింగ్ అపర్చునిటీ అనే అంశం పై సోమవారం ఆన్‌లైన్ ద్వారా వర్క్‌షాప్ నిర్వహించారు. నిట్ డీన్ డాక్టర్ జీఆర్‌కే శాస్త్రి, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ శ్రీఫణికృష్ణ పీ.శంకర్, డాక్టర్ వీ.సందీప్, డాక్టర్ సుదర్శన దీప, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

పబ్జీ ఆడుకుంటూ.. విధి నిర్వహణ

ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశాలు



బుట్టాయగూడెం, జూలై 29 : విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన కెఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని విద్యా శాఖలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న ఎం.సాయిశ్రీ కిరణ్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమ వారం కెఆర్ పురంలోని డీవైఈవో కార్యా లయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మెల్యే తనిఖీ సమయంలో సాయిశ్రీ కిరణ్ విధులను పక్కనపెట్టి సెల్‌ఫోన్‌లో పబ్జీ ఆడుకోవడాన్ని ఆయన గుర్తించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటీడీఏ పీవో ఎం.శ్రీను కుమార్‌ను కలిసి విషయాన్ని ఆయనకు చెప్పి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే ఆదేశాలతో శాఖాపరమైన చర్యలకు డీవైఈవోను నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు పీవో తెలిపారు. డీవైఈవో కార్యాల యంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న సాయిశ్రీకిరణ్ 2018లో కారుణ్య నియామకంలో ఐటీడీఏ విద్యాశాఖలో ఉద్యోగిగా చేరాడు.

సీఆర్‌డీఏ అధికారికి బంగారు నంది అవార్డు



ఏలూరు రూరల్, జూలై 29: దెందు లూరు మండలం గంగన్నగూడెం గ్రామానికి చెందిన సీఆర్‌డీఏ డివిజనల్ సర్వే అధికారి సొంగా రవీంద్రప్రసాద్‌కు సోమవారం హైదరాబాద్‌లో జాతీయ బంగారు నంది అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. విశ్వ విఖ్యాత ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకా డమీ, గౌతమేశ్వర గోసంరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో కార్యక్రమం జరిగింది. తెలంగాణ ప్రముఖ సంఖ్యా శాస్త్రవేత్త శైవజ్ఞశర్మ, గోసంరక్షణ సమితి చైర్మన్ ఆకుల విద్యాసాగర్ గురూజీ, డాక్టర్ ఎస్.వి.ఆర్ వెంకటేష్ గురూజీ చేతులమీదుగా బంగారు నందిని, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. రక్తదాన సేవ, భవిష్యత్ తరాలకు ఆదర్శ నీయమని ప్రాంతాలకు అతీతంగా రక్తదానం సరఫరాలో రవీంద్రప్రసాద్ చేస్తున్న సేవలను వారు కొనియాడారు. రవీంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ అవార్డు విస్తృత మైన సేవలు అందించేందుకు బాధ్యతను పెంచాయని, 30 వేల మందికి రక్తదానం చేయించి, ప్రాణాలు కాపాడినట్లు తెలిపారు.

ఓఎన్‌జీసీ అన్వేషణ

చమురు, గ్యాస్ నిక్షేపాల కోసం విస్తృతంగా సర్వే

యలమంచిలి, పెనుగొండ,పెనుమంత్ర, కాళ్ళ మండలాల్లో తవ్వకాలు

ఇప్పటికే పలుచోట్ల గ్యాస్ నిక్షేపాలు గుర్తింపు



నరసాపురం, జూలై 29: జిల్లాలో చమురు, గ్యాస్ నిక్షేపాల కోసం ఓఎన్‌జీసీ విస్తృత సర్వే చేపట్టింది. ఇప్పటికే పెనుగొండ, పెనుమంత్ర మండలాల్లో రెండు చోట్ల గ్యాస్ నిక్షేపాలను గుర్తించింది. కాళ్ళ, భీమవరం రూరల్ మండలాల్లో కూడా నిక్షేపాల కోసం లోతైన అన్వేషణ చేస్తున్నది. తాజాగా నరసాపురం మండలం సీతారాంపురం గ్రామాల్లో గుర్తించిన గ్యాస్ నిక్షేపాలను తరలించేందుకు పైప్‌లైన్ పనుల్ని కూడా పూర్తి చేసింది. జుత్తిగలో గుర్తించిన గ్యాస్‌ను పైప్‌లైన్ల ద్వారా గెయిల్ సంస్థకు అందిస్తుంది. రానున్న రోజుల్లో యలమంచిలి, ఆచంట మండలాల్లో కూడా విస్తృత సర్వేలు చేసేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది.

నరసాపురంలో క్యాంప్

ఓఎన్‌జీసీ తొలిసారిగా 1977లో నరసాపురం మండలంలో గ్యాస్ నిక్షేపాలను గుర్తించింది. ఎల్‌బీచర్ల గ్రామంలో చేపట్టిన తవ్వకాల్లో భారీగా గ్యాస్ నిల్వలు వెలుగుచూశాయి. సముద్ర పరివాహక ప్రాంతంలో అపార నిల్వలు ఉన్నాయని సర్వేలో తేలడంతో ఓఎన్‌జీసీ నరసాపురం పట్టణంలోని రుస్తుంబాద వద్ద బేస్ క్యాంప్ ఏర్పాటు చేసుకుంది. టెంపుల్ ల్యాండ్‌తో పేరుతో ఏర్పాటైన ఈ క్యాంప్ నుంచి కృష్ణా, గోదావరి జిల్లాల్లో చమురు, గ్యాస్ నిక్షేపాల కోసం గడిచిన 40 ఏళ్ల నుంచి పలు చోట్ల తవ్వకాలు జరిపి గ్యాస్, ఆయిల్ నిక్షేపాలను వెలికితీసింది. కేజీ బేసిన్ పేరుతో పిలిచే ఈ ప్రాజెక్టు ఓఎన్‌జీసీ సంస్థకు ఎంతో లాభాలను చేకూర్చుపెట్టింది. ఈ మూడు జిల్లాల్లో వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధిని కల్పించింది. ఏటా కోట్లాది రూపాయలతో సామాజిక సేవా కార్యక్రమాలను కూడా చేపడుతూ వస్తోంది.

మళ్లీ పశ్చిమపై దృష్టి

గడిచిన కొంతకాలంగా ఓఎన్‌జీసీ తూర్పు, కృష్ణా జిల్లాపైనే దృష్టి సారించింది. కృష్ణా జిల్ల బంటుమిల్లి, కృతివేణి మండలాల్లో పలుచోట్ల తవ్వకాలు జరిపి గ్యాస్, ఆయిల్ నిక్షేపాలను గుర్తించింది. కోనసీమ జిల్లాలో కూడా భారీగా ఆయిల్ నిక్షేపాలను వెలికితీసింది. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని నరసాపురం, మొగల్తూరు, ఆచంట, పెనుగొండ, పెనుమంత్ర, కాళ్ళ, భీమవరం రూరల్ ప్రాంతాల్లో కూడా విస్తృత సర్వే చేసి పలు చోట్ల నిక్షేపాలను గుర్తించింది. పెనుమంత్ర మండలం జుత్తిగలో ఆయిల్ నిక్షేపాలను గుర్తించింది. ఇదే ప్రాంతానికి కొద్ది దూరంలో బ్రహ్మణచెరువు, నత్తారామేశ్వరం వద్ద కూడా రిగ్‌లు వేసి తవ్వకాలు మొదలుపెట్టింది. పెనుగొండ, కాళ్ళల్లో కూడా తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. భీమవరం మండలం లోసరిలో ఇప్పటికే తవ్వకాలు జరిపి గుర్తించిన బావికి సీల్ వేశారు. మరో మూడేళ్ల తరువాత ఇక్కడ నిక్షేపాలు పెరిగితే వాటిని వెలికితీసే యోచనలో ఉన్నారు. ఐదేళ్ల క్రితం నరసాపురం మండలం సీతారాంపురం ఇంజనీరింగ్ కాలేజీ వెనుక జరిపిన తవ్వకాల్లో గ్యాస్ నిక్షేపాలు వెలుగుచూశాయి. వీటిని పైప్‌లైన్ ద్వారా ఓఎన్‌జీసీ టెంపుల్ ల్యాండ్‌లోని రిగ్గుకు తరలించేందుకు పనులు ప్రారంభించారు. ఐదేళ్లవరకు ఈ బావిలో నిక్షేపాలు ఉంటాని ఓఎన్‌జీసీ అంచనా వేస్తుంది. తాజాగా యలమంచిలి, ఆచంట గోదావరి పరివాహక ప్రాంతంలో కూడా చేపట్టిన సర్వేలో గ్యాస్ నిక్షేపాలను గుర్తించారు. త్వరలో ఈ రెండు మండలాల్లో రిగ్గులు వేసేందుకు ఓఎన్‌జీసీ రెడీ అవుతుంది.

అత్యధికంగా గ్యాస్ నిక్షేపాలే

జిల్లాలో చమురు కన్నా గ్యాస్ నిక్షేపాలే లభ్యమవుతున్నాయి. గత మూడేళ్లలో జరిపిన తవ్వకాల్లో గ్యాస్ నిల్వలే బయటపడ్డాయి. జుత్తిగ, సీతారాంపురం బావిల్లో బయటపడ్డ గ్యాస్ నిక్షేపాల మాదిరిగానే పెనుగొండ, పెనుమంత్ర మండలాల్లో జరుపుతున్న తవ్వకాల్లో కూడా గ్యాస్ నిల్వలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం నరసాపురం మండలం నవరసపురం వద్ద ఓఎన్‌జీసీకి సంబంధించి గ్యాస్ స్టోరేజ్ పాయింట్ ఉంది. నరసాపురం, రుస్తుంబాద, చిట్టవరం బావుల నుంచి వస్తున్న గ్యాస్‌ను ఈ రిగ్గు ద్వారా గెయిల్ సంస్థ, విజ్జేశ్వరం, తణుకు ప్రాంతంలోని పలు కంపెనీలకు తరలిస్తున్నారు. ప్రైవేట్ సంస్థలకు ధీటుగా ఓఎన్‌జీసీ చేపట్టిన అన్వేషణకు కొన్ని ప్రైవేట్ కంపెనీలను కూడా జత చేసుకుంది. అత్యంత అధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వ్యయాన్ని తగ్గించుకుని నిక్షేపాల కోసం లోతైన అన్వేషణ చేస్తున్నట్లు ఆ సంస్థకు చెందిన అధికారి ఒకరు వెల్లడించారు.

పంచాయతీ అవినీతిపై కొరడా

ద్వారకాతిరుమల సర్పంచ్, కార్యదర్శి, పూర్వపు ఎంపీడీవోలపై చర్యలకు డీపీవో సిఫార్సు



ద్వారకాతిరుమల పంచాయతీ కార్యాలయం

ద్వారకాతిరుమల, జూలై 29: ద్వారకాతిరుమల మేజర్ పంచాయతీలో 2 కోట్ల రూపాయలు పైబడి జరిగిన అవినీతిపై అధికారులు చర్యలు చేపట్టారు. పంచాయతీలో ఆర్థికపరమైన లావాదేవీలు తక్షణం నిలుపుదల చేయాలని డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ మండల అధికారులకు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి లంకలపల్లి వెంకటేశ్వరరావును విధుల నుంచి తొలగించాలని పంచాయతీ రాజ్ కమిషనర్‌కు సిఫార్సు చేసినట్టు తెలిపారు. గతంలో ఇక్కడ ఎంపీడీవో స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేసి, ప్రసుతం ఎన్‌టీఆర్ జిల్లా రెడ్డిగూడెంలో పనిచేస్తున్న ఆశీర్వాదం రూ.18,73,538 నిధులు దుర్వినియోగం చేశారన్న అభియోగంపై ఆయనపై చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ కమిషనర్‌కు సిఫార్సు చేశామన్నారు. రూ.53,57,376 నిధుల దుర్వినియోగంపై సర్పంచ్ కుంటం స్వర్ణలతకు, రూ.1,30,85,013లకు సంబంధించిన నగదు రికవరీ కోసం కార్యదర్శికి షోకాజ్ నోటీసు ఇచ్చారు. చెక్‌పవర్ రద్దుకు సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చామన్నారు. త్వరలో శాశ్వత పదవి రద్దు కోసం 249 (బి)(1) ప్రకారం చర్యలుంటాయన్నారు.

గుట్టు రట్టయిందిలా..

పంచాయతీలో అవినీతి జరిగిందని గ్రామానికి చెందిన నిమ్మగడ్డ అముక్త ఈ ఏడాది జనవరి 29న ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు విచారణాధికారిగా జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవో రజావుల్లా ఫిబ్రవరి 17న విచారణ చేపట్టారు. పంచాయితీ కార్యాలయంలో రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఖర్చులు, జమలు , వసూళ్ల రికార్డులను చూసి ఫిర్యాదుదారు అముక్త, పంచాయతీ కార్యదర్శి లంకలపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కుంటం స్వర్ణలత, ఈవోపీఆర్డీ సుబ్బరాయన్ తదితరుల నుంచి వివరాలు సేకరించి వారి స్టేట్‌మెంట్‌లను రికార్డు చేశారు. విచారణాధికారి తన నివేదికను ఏప్రిల్ 26న జిల్లా పంచాయతీ అధికారికి సమర్పించారు. తర్వాత కార్యాలయాల చుట్టూ నివేదిక కోసం తిరిగిన అముక్తకు సమాచార హక్కు చట్టం కింద దానిని అందజేయడంతో గుట్టు రట్టయింది.

30 మంది టీచర్ల బదిలీలు రద్దు !

ఏలూరు అర్బన్, జూలై 29 : గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా చేపట్టిన టీచర్ల అక్రమ బదిలీలను రద్దుచేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉమ్మడి జిల్లాలో 30 మందిపై ప్రభావం చూపింది. కౌన్సెలింగ్‌తో నిమిత్తం లేకుండా సార్వత్రిక ఎన్నికలకు ముందు హడా వుడిగా జరిపిన బదిలీల్లో ఒక్కో ఉపాధ్యాయుడి నుంచి రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు వసూళ్ళతో వైసీపీ ప్రభుత్వంలోని ఓ అమాత్యుడు ఆర్థికంగా లాభపడినట్టు ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఎన్నికల ముందు వరుకు జరిగిన ఉపాధ్యాయుల బదిలీలను రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీని ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లలో మొత్తం 30 మందికి గత ప్రభుత్వం వ్యక్తిగతంగా జారీచేసిన బదిలీ ఉత్తర్వులన్నింటినీ రద్దు చేస్తూ ఆదేశాలు జిల్లాకు పంపారు. వాస్తవానికి గవర్నమెంట్ ర్యాటిఫికేషన్ లేకుండా జరిగిన ఈ అక్రమ బదిలీ ఉత్తర్వులు ఈ ఏడాది ఫిబ్రవరిలోనే జారీ అయినా, సంబంధిత టీచర్లు నూతన బదిలీ స్థానాల్లో విధుల్లో చేరడానికి మే ఒకటో తేదీగా నిర్ణయిం చడం, ఈలోగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో అడుగు ముందుకు పడలేదు. ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం పరాజయాన్ని చవి చూడటంతో టీచర్ల అక్రమ బదిలీలు కూటమి ప్రభుత్వ దృష్టికి వచ్చాయి. మరోవైపు అక్రమ బదిలీలను నిలుపుదల చేయాల్సిందిగా ఉపాధ్యాయ సంఘాల నుంచి కూడా డిమాండ్లు ఎక్కువయ్యాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలకు ముందు జరిగిన టీచర్ల హడావుడి బదిలీలన్నింటినీ రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాగా బదిలీ ఉత్తర్వుల రద్దుపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్టు సమాచారం.

సజావుగా డిపార్ట్‌మెంట్ పరీక్షలు

ఏలూరు రూరల్, జూలై 29: ఏలూరులోని సిద్దార్థ ఫెస్ట్ సీబీఎస్ఈ పాఠశాలలో డిపార్ట్‌మెంటల్ పరీక్షలు రెండోరోజు సోమవారం సజావుగా జరిగాయని ఆర్డీవో ఎన్.ఎస్.కె ఖాజావలీ తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షల్లో 38 మందికి 31 మంది హాజరయ్యారని, మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో 65 మందికి 50 మంది అభ్యర్థులు హాజరైనట్టు ఆర్డీవో తెలిపారు.

అనూహ్యం నాటకానికి 3 బహుమతులు

పాలకొల్లు, జూలై 29 :పాలకొల్లు నటీనట సమాఖ్య ఆధ్వర్యంలో తిరు పతిలో ప్రదర్శించిన అనూహ్యం నాటిక 3 బహుమతులు సాధించింది. జాతీ యస్థాయిలో జరిగిన పోటీల్లో ఈ నాటికకు ఉత్తమ జ్యూరీ ప్రదర్శన, ఉత్తమ పాత్రోచిత నటిగా వసుంధర పాత్రధారిణి జ్యోతిరాణికి, ఉత్తమ రంగాలం కరణకు పి.శ్రీధర్‌కు అవార్డులు లభించినట్టు గుడాల హరిబాబు తెలిపారు. నాటక రచయిత తాళాబత్తుల వెంకటేశ్వరరావు అభినందించారు.

ఆదుకోండి..

లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ చికిత్సకు రూ.40 లక్షలు

తమ కుమార్తె ప్రాణం కాపాడాలంటూ అభ్యర్థన



చికిత్స పొందుతున్న విద్యార్థిని జ్ఞానేశ్వరి

ఏలూరు అర్బన్, జూలై 29 : వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగిని కుమార్తె ప్రాణాపాయ స్థితిలో ఉంది. సాయంకోసం దాతల సహాయాన్ని అర్థిస్తోంది. ఏలూరు కొత్తపేట ఐకేపీ భవన్-2 సచి వాల యంలో పనిచేస్తున్న ఏఎన్ఎం కోటం దుర్గ ఏకైక కుమార్తె జ్ఞానేశ్వరి (14)కి కామెర్లు ముదరడంతో లివర్‌మార్పిడి జరగాల్సి ఉందని వైద్య నిపుణులు నిర్ధారించారు. జ్ఞానేశ్వరి ప్రస్తుతం ఏలూరులోని ఓ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. దుర్గ భర్త ఓ కేటరింగ్ సెంటర్‌లో దినసరి వేతనంపై పనిచేస్తున్నారు. భీమడోలు మండలం పోలసానిపల్లి గ్రామానికి చెందిన ఏఎన్ఎం దుర్గ ఏలూరులో విధులు నిర్వర్తిస్తున్నారు. జ్ఞానేశ్వరికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్సకు అవసరమైన ఆర్థిక స్తోమత దుర్గకు లేదు. ప్రభుత్వ సాయం కోసం కూడా ప్రయత్నించింది. సమయం మించి పోతుండటంతో ఆర్థిక సాయం కోసం అందరినీ ఆశ్రయిస్తోంది. రెండు రోజుల్లోగా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయకపోతే ప్రాణానికే ప్రమాదమని విజయవాడలోని ఆంధ్ర హాస్పిటల్స్ వైద్యులు తేల్చిచెప్పారు. ఈ చికిత్స జరగాలంటే రూ.40 లక్షలు ఖర్చవుతుందని అంత స్తోమత లేక ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో సాయం కోరుతున్నారు. డీఎం హెచ్‌వో కార్యాలయ ఉద్యోగులు కొందరు తమకు తోచినంత సాయం అందజేశారు. తన కుమార్తె చికిత్సకు సహకరించి ప్రాణం నిలపాలని ఏఎన్ఎం దుర్గ అర్థిస్తోంది. దాతలు తమ సాయాన్ని ఫోన్‌పే నెంబరు 96767 92602కు పంపి ఆదుకోవాలని కోరుతోంది.

స్కూల్ గేమ్స్ కార్యదర్శి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, జూలై 29 : జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ (అండర్-14,17) సెక్రటరీ పోస్టు భర్తీకి ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న వ్యాయామోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఫిజికల్ డైరెక్టర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈవో అబ్రహం ఓ ప్రక టనలో తెలిపారు. పోస్టు రెండేళ్ల కాలపరిమితికి మాత్రమే ఉంటుందన్నారు. మహిళా అభ్యర్థులకు తొలి ప్రాధాన్యం ఉంటుందన్నారు. దరఖాస్తుదారులు సంబంధిత పాఠశాల హెచ్ఎం సిఫారసుతో ఆగస్టు రెండో తేదీలోగా ఏలూరు డీఈవో కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు.



వద్దిపర్రు రోడ్డుపై వరదనీటిలో ట్రాక్టర్ నడుపుతూ బాధితులను పరామర్శిస్తున్న మంత్రి రామానాయుడు

బాధితులను ఆదుకుంటాం : మంత్రి నిమ్మల

యలమంచిలి, జూలై 29: జగన్ ఐదేళ్లపాలనలో దొడ్డిపట్ల గ్రామంలోని గోదావరిని ఆనుకుని ఏటిగట్టు నివాసితులకు చెందిన కాలనీలో కనీస మౌలిక వసతులు కల్పించకుండా అగ్నికుల క్షత్రియులకు, పేదలకు తీరని అన్యాయం చేశాడని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. దొడ్డిపట్లలో వరద ముంపునకు గురైన పల్లిపాలెం, వద్దిపర్రు గ్రామాల్లో మంత్రి పర్యటించి బాధితులను పరామర్శించారు. బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. రానున్న కాలంలో అన్ని మౌలిక వసతులతో మోడల్ కాలనీగా తీర్చిదిద్దే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఏటిగట్టు పటిష్టతకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికార యంత్రాం గానికి ఆదేశాలు ఇచ్చామని మంత్రి రామానాయుడు తెలిపారు. వద్దిపర్రులోని నాలుగు అడుగుల లోతున ఉన్న వరద నీటిలో ట్రాక్టర్ నడుపు కుంటూ వెళ్లి బాధితులను పరామర్శించారు. ప్రస్తుతం నారుమళ్లు, వరినాటు కుళ్లిపోయాయని వాటి వివరాలను సేకరించి న్యాయం చేస్తామన్నారు. పశు వులకు దాణా ఇచ్చి ఆదుకుంటామన్నారు. వరద తగ్గుముఖం పట్టి యదాస్థితి వచ్చే వరకు ప్రభుత్వం సహాయక చర్యలు చేపడుతుందన్నారు. బాధిత కుటుంబాలకు 720 మందికి ఒక్కొక్క కుటుంబానికి 25 కిలోలు బియ్యం, కిలో కందిపప్పు, ఆయిల్, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, నిత్యావసర సరుకు లను మంత్రి అందించారు. ఇళ్లు మునిగిపోయిన 30 కుటుంబాలకు నిత్యా వసర సరుకులతో పాటు రూ.3 వేలు నగదు అందజేశారు.

ముంపు ప్రాంతాల్లో డీఎంహెచ్‌వో పరిశీలన



పోడూరు మండలంలోని వద్ది పర్రు ముంపు ప్రాంతాల్లో సోమ వారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధి కారి మహేశ్వరరావు పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ముంపు ప్రాంతాల్లోని వరద బాధితులతో ఆయన మాట్లాడి వైద్యం, ఆరోగ్యంపై సూచనలు చేశారు. వరద తగ్గిన తర్వాత బ్లీచింగ్ క్లోరినేషన్ చేపట్టాలని దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసు కోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. వల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డి.వేణుబాబు, ఎంపీహెచ్‌ఈవో ఎం.శివకుమార్, సూపర్‌వైజర్ ఎం.మోహన్, బి.వెంకటేశ్వరావు ఆయన వెంట ఉన్నారు.

యువతలో నైపుణ్యాన్ని గుర్తించాలి : ఎంపీ మహేష్



ఏలూరు రూరల్, జూలై 29: యువతకు ఉపాధి, నైపుణ్యత పెంపుపై పార్లమెంట్‌లో మొదటిసారి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తన గళాన్ని వినిపించి ఆకట్టుకున్నారు. పార్లమెంట్ సమా వేశంలో ప్రశ్నోత్తరాల సమయంలో 85వ ప్రశ్నకు ఏలూరు ఎంపీ మాట్లాడుతూ యువతలో నైపు ణ్యత పెంచి, ఉపాధి ప్రోత్సాహకాలను ప్రకటించిన ఆర్థికమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనలో విఫల మైందన్నారు. నిరుద్యోగం ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా ఉందని యువత సామర్థ్యాన్ని గుర్తించేందుకు ఏపీలో స్కిల్ సెర్చ్ చేస్తు న్నారని స్పష్టం చేశారు. దేశ జనాభాలో 5వ వంతుపైగా ఉన్న పట్టభద్రులు, యువతలో నైపుణ్యతను గుర్తించే చర్యలు కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నదా? లేదా? అని కేంద్ర మంత్రి నుంచి తెలుసుకుంటున్నానని పేర్కొన్నారు. దీనికి సంబంధించి కేంద్ర కార్మిక, ఉపాధిశాఖా మంత్రి మన్‌సుక్ మాండివ్యా మాట్లాడుతూ యువతకు ఉపాధి కోసం నైపుణ్యం చాలా అవసరమని మంచి ప్రశ్న వేసిన ఎంపీ ఆయన అభినందించారు.

దిగమర్రులో పిచ్చి కుక్క స్వైర విహారం

నలుగురిపై దాడి.. వృద్ధురాలి పరిస్థితి విషయం



చికిత్స పొందుతున్న వృద్ధురాలు

పాలకొల్లు రూరల్, జూలై 29 : పాలకొల్లు మండలం దిగమర్రు గ్రామంలో సోమవారం ఒక పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. వృద్ధురాలితో పాటు మరో ముగ్గురిపై దాడి చేయడంతో గాయాల పాల య్యారు. స్నానవరపు సీతమ్మ అనే వృద్ధురాలు తీవ్రంగా గాయపడగా బండి రామకృష్ణ, రాపాక జాన్సన్, సుధాకరరావులకు గాయాలయ్యాయి. వీరిని పాల కొల్లు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సీతమ్మ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది.పిచ్చికుక్కను గ్రామస్థులు హతమార్చారు. కుక్కలను అదుపు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఫోన్‌లో పరిచయం..మోసపోయిన యువతి

జంగారెడ్డిగూడెం, జూలై 29 : ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తిని నమ్మి తన ఇంటి నుంచి వెళ్లిన యువతిని మరో వ్యక్తి మాయ మాటలు చెప్పి ఒక గదిలో పెట్టి అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతి బసు తెలిపారు. విజయనగరం జిల్లా గజపతినగరానికి చెందిన యువతి (17) పదో తరగతి వరకూ చదివి ప్రస్తుతం ఇంటివద్దనే ఉంటున్నది. ఇన్‌స్టాగ్రామ్‌లో రిషి అనే వ్యక్తితో ఆమెకు పరిచయం ఏర్పడింది. కొద్దిరోజుల క్రితం ఆమె జంగారెడ్డిగూడెం వచ్చింది. బస్టాండ్ నుంచి రిషికి ఫోన్ చేయగా అతను వచ్చి ఆమెను చూసి మళ్లీ వస్తానని చెప్పి వెళ్లిపోయాడు ఆమె బస్టాండ్ వద్ద ఉండగా బంటుమిల్లి శ్రీను అనే వ్యక్తి ఆమెను తన ఇంటికి తీసుకువెళ్ళాడు. అక్కడ వేగవరం గ్రామానికి చెందిన రాజు అనే యువకుడు ఆ యువతితో పరిచయం పెంచుకుని ఆమెను తన ఊరు పంపిస్తానని పట్టణంలో ఒక గదిలో ఉంచాడు. ఈనెల 26న గదిలో ఉన్న యువతిని కొట్టి అత్యాచారం చేశాడు. యువతి ఫిర్యాదు చేయగా ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదం.. ఇద్దరి మృతి

నరసాపురం రూరల్, జూలై 29: మండలంలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో సోమవారం ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మండలంలోని జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఓఎన్‌జీసీ లారీని బైక్‌పై వెళ్తుతున్న వ్యక్తి ఢీకొట్టడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడు పెనుమంత్ర మండలం జుత్తిగ గ్రామానికి చెందిన వెంకటరెడ్డి (43)గా గుర్తించారు. రుస్తుంబాద గ్రామంలోని కోళ్ళఫారం నిర్వహణ చేసుకుంటూ నరసాపురంలో ఉంటున్నాడు. మృతుడిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మండలంలోని ఎల్‌బీ చర్ల గ్రామంలో ఆటోని బైక్ ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే ఒక వ్యక్తి మృతి చెందాడు. మృతుడు మోడీ గ్రామానికి చెందిన గుబ్బల భానుప్రకాష్ (25)గా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, జూలై 29 : పట్టాలు దాటుతున్న వృద్ధుడిని వేగంగా వెళ్తున్న రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భీమడోలు రైల్వేస్టేషన్ వద్ద సుమారు 60 సంవత్సరాల వయసు కల్గిన వృద్ధుడు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ సైమన్‌కు సిబ్బందితో వెళ్ళి పరిశీలించారు. మృతుడు 5.5 అడుగుల ఎత్తు ,తెల్లని జుత్తు, తెల్లని గడ్డంతో ఉన్నాడు. కుంకుమ రంగు పొట్టి చేతుల చొక్కాతో ఉన్నాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసినవారు రైల్వే ఎస్ఐ నంబర్ 99892 19559కు సమాచారం అందించాలని కోరారు.

పాలకొల్లులో పట్ట పగలే దారుణం

వృద్ధురాలిని గాయపరిచి, నగలు చోరీ



చోరీ జరిగిన ఇంటి వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం, డీఎస్పీ శ్రీనివాసరావు.. దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న అనసూయ

పాలకొల్లు అర్బన్, జూలై 29 : పాలకొల్లు పట్టణంలో సోమవారం జరిగిన సంఘటన సంచలనం రేపింది. పట్టపగలే దొంగలు హల్‌చల్ చేశారు. 6వ వార్డు బోండాడ వారి వీధిలో నివసిస్తున్న కలిశెట్టి అనసూయ అనే వృద్ధు రాలిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి ఆమె ఒంటిపై ఉన్న బంగారు వస్తువులను దొంగిలించుకు పోయారు. అనసూయ భర్త శ్రీనివాసరావు ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైరయ్యారు. ఆయన మరణించడంతో పట్ట ణంలో కూతురు ఇంటి కింద భాగంలో ఉంటోంది. అనసూయ ఒంటరిగా ఉన్న సమయంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి రాయితో తీవ్రంగా గాయ పరిచారు. ఆమె మెడలోని బంగారు గొలుసు, చెవి దుద్దులు, నాలుగు బంగారు గాజులు దొంగిలించుకుపోయారు.భవనం పైఅంతస్తులో ఉంటున్న ఆమె కుమార్తె కింద జరిగిన సంఘటన గమనించి కేకలు వేయడంతో దండగులు పారిపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పట్టణ పోలీసులు రంగంలోకి దిగారు. తీవ్రంగా గాయపడిన అనసూయను స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం రాజమండ్రికి తరలించారు. సంఘటన స్థలానికి క్లూస్ టీమ్‌తో సహా చేరుకున్న ఎస్పీ అద్నాన్ నయీం బాధిత కుటుంబంతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. పట్టణంలోని మావుళ్ళ మ్మపేటకు చెందిన ఒకయువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకోగా మరో వ్యక్తి అమలాపురానికి చెందిన వాడిగా తెలిసింది.

ఏటీఎం కార్డు మార్చి.. సొమ్ము కాజేశారు

జంగారెడ్డిగూడెం, జూలై 29 : ఏటీఎంలో డబ్బులు డ్రా చేసేందుకు వెళ్లిన ఒక వృద్ధుడి ఏటీఎం కార్డును మార్చి అతని బ్యాంకు ఖాతా నుంచి రూ.31,500 కొట్టేశారు. దీంతో బాధితుడు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. బుట్టాయ గూడెం మండలం మర్లగూడెం గ్రామానికి చెందిన పరిటాల లక్ష్మీనారాయణ జంగారెడ్డిగూడెం పట్టణంలోని యూనియన్ బ్యాంకులో అకౌంట్ కలిగి ఉన్నాడు. ఈనెల 27వ తేదీన ఏలూరు రోడ్డులో ఉన్న ఒక ప్రైవేటు బ్యాంకు ఏటీఎంలో నగదు విత్‌డ్రా చేయడానికి వెళ్లాడు. అప్పటికే అక్కడ ఉన్న యువతీ, యువకులు వృద్ధుడి ఏటీఎం ద్వారా రూ.3500 నగదు విత్‌డ్రా చేసి ఇచ్చారు.ఆ సమయంలోనే ఆయన ఏటీఎం కార్డు ఇవ్వకుండా వేరే కార్డు ఇవ్వడంతో గమనించని వృద్ధుడు అక్కడి నుంచి వెళ్లి పోయాడు. సోమవారం తన పాస్ పుస్తకంలో పోస్టింగ్ వేయించుకునేందుకు వచ్చిన తర్వాత ఆయన అకౌంట్ నుంచి దఫ దఫాలుగా రూ.31500 కట్ అయినట్లు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బాల్య వివాహాలు నేరం



కొండావారిపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

మొగల్తూరు, జూలై 29: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని వాటిపై కిషోర బాలికలు, వారి తల్లి తండ్రులు అవగాహన కల్పించుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో బి.ఊర్మిళ అన్నారు. మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం మొగల్తూరు పంచాయతీ కొండావారిపాలెంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ పోక్సో పోసో చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి.విజయకుమారి, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీతోనే ఉద్యోగ అవకాశాలు

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 29 : నూతన టెక్నాలజీ అధ్యయనంతోనే ఉద్యోగ అవకాశాలు అందుకోగలరని ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ బోధన టెక్నాలజీస్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ పృధ్వీతేజ్ అన్నారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కాంపిటేటివ్ కోడింగ్ అనే అంశంపై వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పృధ్వీతేజ్ మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ కంపెనీలు సమస్యను వేగంగా, సమర్థవతంగా తక్కువ సమయంలోనే పరిష్కరించగల నైపుణ్యం ఉన్నవారిని ఉద్యోగాలకు తీసుకొంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కెవి మరళీకృష్ణంరాజు, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ హెడ్ డా.వి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పాలస్తీనా-ఇజ్రాయిల్ యుద్ధం ఆపాలి

నరసాపురం టౌన్, జూలై 29: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దేశం యుద్ధం ఆపాలంటూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్‌లో ఆందోళన చేశారు. గత ఏడాది ఇజ్రాయిల్‌పై ఇస్లామిక్ సంస్థ అమాస్ ఆకస్మిక దాడిని ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయన్నారు. పాలస్తీనా దేశంపై దాడులు చేయడం వల్ల 400 మంది పిల్లల్ని పొట్టన పెట్టుకుందన్నారు. 290 రోజులుగా జరుగుతున్న ఈ దాడుల్లో లక్షలాది మంది మృతి చెందారన్నారు. తక్షణం ఇజ్రాయిల్ దేశం దాడులు ఆపేలా ప్రపంచ దేశాలు చర్యలు తీసుకోవాలన్నారు.

పాలకొల్లు అర్బన్: పాలస్తీనా ప్రజలు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం పోరాటం చేస్తున్నారని వారికి రక్షణ కల్పించాలని మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజ గోపాల్ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం గాంధీ బొమ్మల సెంటర్‌లో పాలస్తీనా ప్రజలకు సంఘీభావ ప్రదర్శనలో రాజ గోపాల్ పాల్గొని మాట్లాడారు. బ్రిటన్, అమెరికా అండదండలతో పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించి, ఇజ్రాయల్ దేశం దాడులు చేస్తున్నదని అన్నారు.

ముంపు చేలు పరిశీలన



కుళ్లిన నారుమడుల్ని పరిశీలిస్తున్న ఏడీఈ అనిల్‌కుమారి

నరసాపురం రూరల్, జూలై 29: మల్లవరం, లిఖితపూడి, కొప్పర్రు గ్రామాల్లో నీట మునిగిన వరి చేలను సోమవారం వ్యవసాయశాఖ ఏడీఈ అనిల్‌కుమారి పరిశీలించారు. చేనులో వరద నీరు బయటకు వెళ్లేలా చూడాలన్నారు. వరద, వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని ఇప్పటికే జిల్లా అధికారులకు నివేదించామని అన్నారు.

మహిళలపై అత్యాచారాలు అరికట్టాలి

ఆకివీడు, జూలై 29 : మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను అరికట్టాలని ఐద్వా మహిళలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ బత్తిన నాగబాబుకు వినతిప త్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా పట్టణ అధ్యక్షురాలు డేకల లక్ష్మి మాట్లాడుతూ పలు ప్రాంతాలలో మహిళలు, మైనర్ బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు నివారించాలన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి సరఫరా కాకుండా చూడాలన్నారు. దొంగతనాలు జరగకుండా చూడాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

పాలకొల్లు రూరల్, జూలై 29 : ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని లంకలకోడేరు పీహెచ్‌సీ డాక్టర్ ఎ.ప్రతాప్ కుమార్ అన్నారు. సోమవారం చింతపర్రు గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి రాజ్ కుమార్,విస్తరణాధికారి గుడాల హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు

పశువుల దాణా అందజేత

యలమంచిలి, జులై 29: వరద బాధిత పాడిరైతులకు పశువుల దాణా పంపిణీ సోమవారం చేపట్టారు. కనకాయలంక, పెదలంక గ్రామాల్లోని 200 మంది పాడిరైతులకు పశువుల దాణా(సంపూర్ణ మిశ్రమదాణా)ను ఎన్డీఏ కూటమి నాయకులు ఉచితంగా పంపిణీ చేశారు. 200 మంది రైతులకు సుమారు రూ.3,16,000 విలువచేసే 20 టన్నుల పశువుల దాణా ఉచితంగా అందించామని మండల పశువైద్యాధికారి పి.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భీమవరం డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ జవర్ హుస్సేన్, రాష్ట్ర తెలుగురైతు ఆర్గనైజింగ్ కార్యదర్శి రుద్రరాజు సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

యలమంచిలి, జూలై 29: మండలంలోని వరదముంపు గ్రామాలైన లక్ష్మీపాలెం, గంగడపాలెం, అబ్బిరాజుపాలెం, బూరుగుపల్లి, కె.ఎస్.పాలెం గ్రామాల్లో వరదబాధిత కుటుంబాలకు ఎన్డీఏ కూటమి నాయకులు బియ్యం, నిత్యావసర సరుకులను సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు, ఆరుమిల్లి రామశ్రీనివాస్, కడలి గోపి, పాలపర్తి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో బీజేపీ నాయకుల పర్యటన

ఉండి జూలై 29: మండలంలో ముంపునకు గురైన పొలాలు, బొండాడ డ్రెయిన్‌ని బీజేపీ నాయకులు పరిశీలించారు. డ్రెయిన్ల అభివృద్ధి గురించి గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సార్వా పంట ముంపుబారిన పడిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోట గంగరాజు, అసెంబ్లీ కోకన్వీనరు గాదిరాజు వెంకటేశ్వరరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మన నాగబాబు, ఉండి మండల బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు యర్రా విక్రమ్, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్‌కు పాము కాటు

యలమంచిలి, జూలై 29: యలమంచిలిలంక గ్రామంలోని ఒక ప్రైవేటు రిసార్ట్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న పాలపర్తి సందీప్ సోమవారం పాముకాటుకు గురయ్యాడు. స్థానికులు అతనిని వెంటనే గ్రామంలోని వైద్యశిబిరానికి తరలించారు. వైద్యసిబ్బంది అతనికి తగిన వైద్యం అందించి పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సందీప్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారని వరద ప్రత్యేక అధికారి సిహెచ్.దేవి తెలిపారు.

మిషనరీ హాస్టల్‌లో అధికారుల తనిఖీలు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 29: పౌష్టికాహార లోపం వల్లే బాలిక అస్వస్థతకు గురైందని సీడీపీవో టీఎల్ సరస్వతి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మిషనరీ హాస్టల్ బాలిక పి. జానకి ఆదివారం రాత్రి అపస్మారక స్థితిలో ఆసుపత్రిలో చేరిందనే వార్తలపై ఐసీడీఎస్ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. తాడేపల్లిగూడెం ఎఫ్‌సీఐ కాలనీలోని శాంతి మిషనరి ఐసీడీఎస్ సీడీపీవో టీఎల్ సరస్వతి ఆధ్వర్యంలో హాస్టల్ అనుమతులపై పరిశీలించడంతో పాటు బాలిక ఆరోగ్య పరిస్థితులపై ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడుతూ హాస్టల్‌లో బాలికలను ఉంచేందుకు అనుమతులు చూపించలేదని వివరించారు. 1 నుంచి 6వ తరగతి వరకూ స్కూల్, రెసిడెన్సీ అనుమతులు మాత్రమే ఉన్నాయని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. ఎస్సై సుధాకర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని, ఆర్ఐ, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పోషకాహార గార్డెన్‌లపై సమావేశం

భీమవరం టౌన్, జూలై 2: జిల్లాలోని పాఠశాలల్లో పోషకాహార గార్డెన్‌లను అభివృద్ధి చేయడం ద్వారా ఉద్యానవన పంటల సాగుపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందుతాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టర్ అధ్యక్షతన పాఠశాలల్లో కిచెన్ గార్డెన్స్ సాగుపై పలు శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలల్లో, వారి ఇళ్లలో సొంతంగా కూరగాయలు, పండ్లను పండించే అలవాటును పెంపొందించడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు.






భీమవరంలో ఎమ్మెల్యే అంజిబాబు, నరసాపురంలో ఎమ్మెల్యే నాయకర్, జగన్నాథపురంలో ఎమ్మెల్యే బొలిశెట్టి ముంపు బాధితులకు సరుకులు అందిస్తున్న దృశ్యం.. సిద్ధాంతంలో గోదావరి మాతకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పితాని దంపతులు

కష్టాలో ఉన్నవారికి అండగా ఉంటాం

భీమవరం టౌన్, జూలై 29 : కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలబడతామని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పునరావాస కేంద్ర వాసులకు 32మందికి రూ.3 వేలు చొప్పున రూ.96 వేలు, 444మందికి ఒక్కొక్కరికి 25 కేజీల చొప్పున బియ్యం, కేజీ చొప్పున 444 కేజీల ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, ఆయిల్, కందిపప్పులను ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అందించారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు), తహసీల్దార్ లంక శివకుమార్, జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, మద్దుల రాము, గంటా త్రిమూర్తులు పాల్గొన్నారు.

● భీమవరం గునుపూడి సౌత్ డ్రెయినేజీలో కిక్కిస, గుర్రపు డెక్కతో పేరుకుపోయిందని, సమస్యను పరిష్కరించాలని ఆప్రాంత రైతులు సోమవారంనాడు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులును కోరారు. ఎమ్మెల్యే కార్యాలయంలో వారు డ్రెయిన్ సమస్యను తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే అంజిబాబు స్పందించి డ్రెయినేజీ డీఈ సుబ్రహ్మణ్యంతో మాట్లాడారు. వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తాడేపల్లిగూడెం రూరల్: ఎర్రకాలువ ముంపుతో నష్టపోయిన అందరికీ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలో ఎర్రకాలువ వరదలకు మునిగిన జగన్నాథపురం, మారంపల్లి, ఆరుళ్ల, నందమూరు గ్రామాల్లో బాధితులకు ప్రభుత్వం తరఫున తక్షణ సాయంగా ఒక్కొక్కరికి రూ.3 వేల నగదు, బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ ముంపు ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు సాయపడకపోగా ఈ ముంపును కూడా రాజకీయం చేయడం బాధాకరమన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: తుఫాన్ సమయంలో ప్రజలు ఇబ్బంది పడకుండా మున్సిపల్ అధికారులు, సిబ్బంది చేసిన సహాయక చర్యలు అభినందనీయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు సమష్టి కృషితో ప్రజలకు ఇబ్బంది లేకుండా చేశారని అన్నారు. ఇన్‌చార్జి కమిషనర్ మురళీకృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆచంట: వరద బాధిత లంకగ్రామాల ప్రజలను ఆదుకుంటామని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. అయోధ్యలంక, పెదమల్లం లంక, కోడేరు లంక, భీమలాపురం లంకగ్రామాలకు ఎమ్మెల్యే పితాని సోమవారం కోడేరు నుంచి పడవపై వెళ్ళి అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లంకలో వేసిన పంట పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయని వెంటనే తమకు నష్టపరిహారం ఇప్పించాలని పలువురు రైతులు ఎమ్మెల్యే పితాని దృష్టికి తీసుకువచ్చారు. లంకల్లో జరుగుతున్న మెడికల్ క్యాంప్, విద్యుత్ సరఫరాపై ఆరా తీశారు. ఈ సందర్భంగా లంక గ్రామాలకు సంబంధించి ముంపు బారిన పడిన 1659 కుటుంబాల వారికి నిత్యావసర సరుకులు పితాని అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి పాల్గొన్నారు.

గోదావరి మాతకు ఎమ్మెల్యే దంపతుల పూజలు

పెనుగొండ: గోదావరి మాత శాంతించాలని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, అనంతలక్ష్మి దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. సిద్ధాంతం లోని కేదార్ ఘాట్ వద్ద వశిష్ఠ గోదావరిలో పూజలు నిర్వహించారు. గోదావరి మాతకు పసుపు కుంకుమ నూతన వస్త్రాలు సమర్పించారు. అనంతరం పుష్పాలు గోదావరిలో సమర్పించి హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో పితాని సత్యనారాయణ కోడలు నాగ సాహితి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఉండవల్లి చిన్ని, తానేటి మదన్, సర్పంచ్ చింతపల్లి గణిరాజు, గణపతి, కట్టా శ్రీనివాస్, బొబ్బిలి శ్రీను, రవి వర్మ, మారుతి, శ్రీరామ్‌మూర్తి, రామకృష్ణ పాల్గొన్నారు.

ముంపు బాధితులకు పక్కా గృహాలు

నరసాపురం రూరల్, జూలై 29: ముంపు బారిన పడకుండా త్వరలో పక్కా గృహాలు నిర్మిస్తామని ఎమ్మెల్యే నాయకర్ అన్నారు. సోమవారం మండలంలోని కొత్త నవరసపురం గ్రామంలోని ఎస్సీకాలనీ బాధితులకు ప్రభుత్వం తరుపున బియ్యం, ఇతర నిత్యావసరాలందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గోదావరికి వరదలు వచ్చినప్పుడల్లా ఇక్కడ ఎక్కువగా ముంపు జరుగుతుందన్నారు. ప్రభుత్వంతో చర్చించి అందరికి పక్కా గృహాలు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఈవోఆర్డీ శర్మ, వీఆర్వో సత్తిబాబు, వాతాడి కనకరాజు, గంటా కృష్ణ పాల్గొన్నారు.

కల్వర్టు పనులు ప్రారంభం...

అనంతరం పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో కల్వర్టుల పనుల్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. చేపట్టిన్న పనుల్ని సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, చైర్‌పర్సన్ వెంకటరమణ, కమిషనర్ వెంకటేశ్వరావు, జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి, కొల్లు పెద్దిరాజు, దొండపాటి స్వామి పాల్గొన్నారు.

పాడి రైతులకు చేయూత

సరిపల్లి గ్రామంలో పశువైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. పాడి రైతులకు ప్రభుత్వపరంగా చేయూతనిస్తామన్నారు. సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. గ్రామాల్లో మరిన్ని క్యాంపులు నిర్వహించి పాడి రైతుల అవసరాలు తీర్చాలన్నారు. ఈకార్యక్రమంలో ఏడీఈ డాక్టర్ సుధాకర్, డాక్టర్ సురేంద్ర, సర్పంచ్ ఈదా సురేష్ పాల్గొన్నారు.





ఆకివీడులో విద్యార్థులతో కలిసి భోజనాలు చేస్తున్న ప్రజా ప్రతినిధులు.. పెదతాడేపల్లిలో భోజనాలు వడ్డిస్తున్న కూటమి నాయకులు.. తాడేపల్లిగూడెంలో విద్యార్థులకు భోజనం తినిపిస్తున్న టీడీపీ నాయకుడు గొర్రెల శ్రీధర్

పాఠశాలల్లో శుభదిన్ భోజన్

మధ్యాహ్న భోజనం పరిశీలన
విద్యార్థులతో కలిసి కూటమి నాయకుల సహపంక్తి భోజనాలు

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 29 : విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థితికి రావాలని మానవత సంస్థ చైర్మన్ బుద్దరాజు వెంకటపతిరాజు అన్నారు. శిక్ష సప్తాహ కార్యక్రమంలో భాగంగా సోమవారం నాడు శుభదిన్ భోజన్ (తిథి భోజనం) కార్యక్రమం 19వ వార్డులోని ఎంజీఎం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. బుద్దరాజు వెంకటపతిరాజు మన వడు పుట్టిన రోజు సందర్భంగా పాఠశాలకు 160 స్టీల్ ప్లేట్లు, స్టీల్ స్టాండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మానవతా డైరెక్టర్ ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ పాఠశాలకు మౌళిక సదుపాయాలు అందించిన వెంటకపతిరాజు, బిజిఆర్‌కె రాజు, దీప్తి, పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు షేక్ బాబాజీ సాహెబ్‌ను అభినందించారు. టీడీపీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు ఎండి అల్లావుద్దీన్ నౌషద్ పాల్గొన్నారు.

ఆకివీడు: విద్యార్థులు క్రమశిక్షణతో మంచిగా చదువుకొని సమాజాభివృద్ధికి పాటుపడాలని అజ్జమూరు సర్పంచ్ చలపతి అన్నారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా సోమవారం 2,15 వార్డుల్లోని ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి శుభదిన్ భోజనం చేసి మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోపిశెట్టి వెంకట సత్యవతి, జనసేన నాయకుడు చిరంజీవి సత్యనారాయణ, పదిహేనవ వార్డు టీడీపీ, జనసేన ఇన్‌ఛార్జీలు చేబోలు పెద్దిరాజు, నేరెళ్ళ విజయ్, సునీత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్వీఎస్ నారాయణ పాల్గొన్నారు.

పెనుగొండ/ఆచంట: వడలి, ములపర్రులోని మద్దిగుంట చెరువులో ఉన్న స్కూలు విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనంపై కూటమి నాయకులు ఆరా తీశారు. విద్యార్థులను అడిగి తెలుసుకుని పిల్లలతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాసాని విజయ లక్ష్మి, పెద్దిరాజు, బాస్కరావు, శేఖర్, గణపతినీడి బుల్లియ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆచంట మండలంలో కూడా మధ్యాహ్న భోజనాలను కూటమి నాయకులు పరిశీలించారు.

పెంటపాడు: పడమర విప్పర్రులోని 9 ప్రభుత్వ పాఠశాలల్లో 400 మంది విద్యార్థులకు జనసేన రాష్ట్ర నాయకుడు గంటా నాగ వెంకట సుబ్రహ్మణ్యం తన సొంత సొమ్ము రూ. 40 వేలు వెచ్చించి స్వీట్లు, కేకులు, బిస్కెట్‌లు, పండ్లు, జ్యూస్‌తో కూడిన కిట్‌లు అందజేశారు. ఎంఈవోలు శ్రీనివాస్, టీవీ.రామకృష్ణ, పసల కొండ, పసుపులేటి అమ్మిరాజు, నయనాల సూర్యచంద్రరావు, బోణం నాగ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలోని 17వ వార్డు పాఠశాలలో డొక్కా సీతమ్మ బడి భోజన పథకాన్ని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ ప్రారంభించారు. విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం అజయకుమారి పాల్గొన్నారు.

భీమవరం టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో బాలలకు భోజనాలు, స్వీట్స్, పండ్లు పంపిణీ చేశారు. అరసవల్లి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: వీవర్స్ కాలనీలోని మున్సిపల్ ఎలిమెంట్రీ పాఠశాలలో శుభ తిధి భోజనాలు నిర్వహించారు. ఎంఈవో గంగాధర శర్మ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలన్నారు. డాక్టర్ సంగినీడి వెంకట రంగారావు, హెచ్‌ఎం భవానీ ప్రసాద్‌ల ఆర్థిక సహాయంతో భోజనాలు ఏర్పాటు చేశారు.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలం, పట్టణంలో తిథి భోజన కార్యక్రమం సోమవారం కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పెదతాడేపల్లిలో సర్పంచ్ పోతుల అన్నవరం ఆధ్వర్యంలో విద్యార్థులకు భోజనాలతో స్వీట్లు, పండ్లు వడ్డించారు. చినతాడేపల్లిలో టీడీపీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్ విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కృష్ణాయపాలెంలో సర్పంచ్ బేతపూడి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో కూటమి నాయకులు భోజనాలు వడ్డించారు.

గణపవరం: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా అమలు చేసేందుకు కృషి చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణరాజు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు కోరారు. సోమవారం అర్ధవరం హైస్కూల్‌లో మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలించారు. గత వైసీపీ ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు చెల్లించవలసిన బకాయిలు చెల్లించలేదని ఆరోపించారు. విద్యార్థులకు అరటిపండ్లు అందించారు. పోషక విలువలతో కూడిన మెనూను డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పేరుతో అందించడం స్ఫూర్తిదాయకమన్నారు.

సోమేశ్వరస్వామి నిత్యాన్నదానానికి విరాళం



భీమవరం టౌన్, జూలై 29 : గునుపూడిలోని సోమేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి రాజమండ్రికి చెందిన కడలి దుర్గారత్నం కుటుంబ సభ్యులు 50,116 రూపాయలు విరాళంగా అందించారు. ముందుగా దాతలు స్వామివారిని దర్శించుకోగా ఆలయ అర్చకుడు చెరుకూరిరామకృష్ణ పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరుపున ప్రసాదాన్ని ఈవో రామకృష్ణంరాజు అందించారు.

భూగర్భ జలాలను పరిరక్షించుకోవాలి

పెంటపాడు, జూలై 29: భూగర్భ జలాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఇంకుడు గుంతలు ప్రతి ఇంటి వద్ద, కళాశాలలోనూ నిర్మించుకోవాలని వైస్ ప్రిన్సిపాల్ టీఎస్ఎన్ ప్రసాద్ అన్నారు. సోమవారం పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జలశక్తి అభియాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు బీ.సురేంద్ర, సుంకర గోపాల్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ అధికారులు ప్రేమ్‌సాగర్, విజయ్‌బాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పండ్ల వర్తక సంఘం సత్కారం

తణుకు, జూలై 29: పండ్ల వర్తక సంఘం అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన పాలకవర్గం కృషి చేయాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీనివాసా పండ్ల వర్తక సంఘం అధ్యక్షుడు కాకర్ల జయరాజు ఆధ్వర్యంలో పలువురు సభ్యులు ఆరిమిల్లిని సత్కరించారు.

మృతుడి కుటుంబానికి ఆరిమిల్లి చేయూత

తణుకు, జూలై 29: పట్టణంలో ఇటీవల మృతి చెందిన మున్సిపల్ కార్మికుడు చిటికిన శ్రీను కుటుంబానికి అండగా నిలుస్తామని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో శ్రీను ఇద్దరు కుమార్తెలకు చెరో లక్ష రూపాయలు చొప్పున రెండు లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన పత్రాలతో పాటు ఇంటి స్థలం మంజూరు పత్రాలు అందించారు. మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కలగర వెంకట కృష్ణ, తాతపూడి మారుతీరావు, గుమ్మళ్ళ హనుమంతు, ఒమ్మి రాంబాబు, తమరాపు వల్లపరావు పాల్గొన్నారు.

ఉండి పార్కులో అభివృద్ధి పనులు

ఉండి జూలై 29: ఉండి పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను టీడీపీ నాకులు కాగిత బుజ్జి, కరిమెరక నాగరాజు పరిశీలించారు. వారం రోజులు నుంచి కలిదిండి అబ్బాయిరాజు జన్మభూమి పార్కులో అభివృద్ధి పనులు చురుకుగా జరుగుతున్నాయి. చెత్త తొలగింపు, క్లీన్‌అండ్‌గ్రీన్‌తో పాటు వాకింగ్‌ట్రాక్, విద్యుత్ అలంకరణ తదితర పనులను చేపట్టినట్లు తెలిపారు. వాండ్రం గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త ద్వారంపూడి నారాయణరెడ్డి పెయింట్స్ వేయించడానికి ముందుకు వచ్చారన్నారు.

వరద బాధితులకు నగదు, కూరగాయలు

గణపవరం, జూలై 29: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, యనమదుర్రు డ్రెయిన్ వరద కారణంగా పిప్పరలో ముంపు బారినపడిన బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.3 వేలు నగదు, కూరగాయలు, టీడీపీ, జనసేన నాయకులు పంపిణీ చేశారు. ఇందుకూరి రామకృష్ణంరాజు, యాళ్ళ సుబ్బారావు, తోట శ్రీనివాసరావు, గంటా అన్నవరం, యర్రా గణేష్, తహసీల్దార్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతపై అవగాహన ఉండాలి

పెంటపాడు, జూలై 29: విద్యార్థులు వివిధ రంగాల్లో మారుతున్న సాంకేతిక అంశాల పట్ల అవగాహన కల్గి ఉండాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. సోమవారం పెంటపాడు ఎస్‌టీపీఎస్ పాఠశాలలో ఇంపాక్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సాంకేతిక అభివృద్ధిపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీదేవి, ఇంపాక్ట్ సంస్థ ప్రతినిధులు ఎస్.ఎన్.కే.వర్మ, శారదారాణి పాల్గొన్నారు.

ఆక్వా రైతుల పాలాభిషేకం

వీరవాసరం (భీమవరం టౌన్) : ఆక్వాకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కస్టమ్స్‌డ్యూటీ తగ్గించడంపై ఆక్వా రైతులు హర్షం వ్యక్తం చేస్తూ సోమవారంనాడు వీరవాసరంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫొటోలకు పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా వీరవాసరం మండలం ఆక్వా రైతుల అధ్యక్షుడు తులసీ రాంబాబు, పాలకొల్లు ఆక్వా రైతుల సంఘం అధ్యక్షుడు భగవాన్ రాజు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో తీసుకున్న నిర్ణయంతో ఆక్వా మేతల ధర తగ్గుతుందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు జీకేఎఫ్ సుబ్బరాజు, యువరాజ్, వీరవల్లి చంద్రశేఖర్ ఆక్వారైతులు తదితరులు పాల్గొన్నారు.

యునైటెడ్ కాపు సర్వీసెస్ క్లబ్ సేవలు భేష్

పాలకొల్లు అర్బన్, జూలై 20 : యునైటెడ్ కాపు సర్వీసెస్ క్లబ్ (ఇంటర్నేషనల్) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం అడబాల గార్డెన్స్‌లో జరిగింది.ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ క్లబ్ సేవలను అభినందించారు. ఈసందర్భంగా క్లబ్‌కు పలు అవార్డులు లభించినట్లు అధ్యక్షుడు జక్కంపూడి మదన్ తెలిపారు. డాక్టర్ బాబ్జీ, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.


హధీరాం భూములను కాపాడాలి



హధీరాం భూములను పరిరక్షించాలని కరపత్రాలు చూపుతున్న బాబ్జి, టీడీపీ నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 29: నవీ ముంబాయిలోని హధీరా ం మఠానికి చెందిన 84 ఎకరాలను ఎన్నికల ముందు ఒక అవినీతి మాజీ మంత్రి అమ్మేందుకు ప్రయత్నాలు చేశాడని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి ఆరోపిం చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మఠానికి సంబంధించిన పొలాలు కోర్టులో ఉన్నాయి. అమ్మేందు కు వీలు కాదని అప్పటి అధికారులు చెప్పినా వినకుండా ముంబాయి వెళ్ళి సుమారు రూ. 2500 కోట్లకు అమ్మేందుకు ప్రయత్నించాడన్నారు. దీనిపై ఆ మంత్రి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఆ మంత్రి టీడీఆర్ బాండ్‌లపై చేసిన అవినీతిపై సీబీసీఐడీ విచారణకు ఆదేశాలు జారీ అయ్యా యన్నారు. అనంతరం హధీరాం భూములను పరిరక్షించాలంటూ కరపత్రాలను ఆవిష్కరించారు. గొర్రెల శ్రీధర్, కిలపర్తి వెంకట్రావు, దాట్ల జగన్నాథరాజు, సబ్బేను కృష్ణమోహన్, షేక్ బాజి, సురగాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు పాటుపడాలి



పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, జూలై 29: విద్యార్థులు లక్ష్య సాధనకు పాటుపడాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం చిట్టూరి ఇంద్ర య్య కళాశాలలో మానవత ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడుతూ అథ్లెట్ దండి జ్యోతికశ్రీకి గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో లక్ష రూపాయలు ఇచ్చి ప్రోత్సహి ంచానని, ఆమె ఒలింపిక్స్‌లో పాల్గొనడం మనందరికి గర్వకారణమన్నారు. మానవత నాయకులు గమిని రాంబాబు, ప్రగతి రాజా, ఎస్.వి.సతీష్‌బాబు, రామలక్ష్మి, కటారి శారదాదేవి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల ఆశాజ్యోతి డీఎస్ నకారాకు నివాళులు

భీమవరం టౌన్, జూలై 29 : పెన్షనర్ల జీవనజ్యోతి, పెన్షనర్ల జీవితాలలో వెలుగునింపిన డీఎస్ నకారా వర్ధంతి సందర్భంగా స్టేట్ గవర్నమెంట్ రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్, భీమవరం శాఖ కార్యాలయంలో ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా భీమవరం ఉప ఖజానా అధికారి రవి వర్మ మాట్లాడుతూ పెన్షన్ ఉద్యోగికి భిక్ష కాదని, ప్రాథమిక హక్కు అని, పెన్షన్ అనేది పదవీ విరమణ అనంతరం వృద్ధాప్య జీవితాన్ని స్వతంత్రంగా జీవించడానికి చెల్లింపుగా పరిగణించాలి అని చెబుతూ అటువంటి పెన్షన్ సాధించడానికి న్యాయ పోరాటం చేసిన డీఎస్ నకారా ఘన నివాళి అర్పించారు.

నిమ్మ, కోడిగుడ్డుపై అవగాహన

వీరవాసరం (భీమవరం టౌన్) 29: కోడిగుడ్డు, నిమ్మరసం మొక్కల ఎదుగుదలకు పనిచేస్తాయని ప్రకృతి వ్యవసాయ జిల్లా కోఆర్డినేటర్ అరుణ కుమారి అన్నారు. వీరవాసరం మండలం నౌడూరు గ్రామంలో కోడిగుడ్డు నిమ్మరసంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోడిగుడ్డు నిమ్మరసం తయారు చేసి ఎస్‌హెచ్‌జీ మహిళలకు, రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కోడిగుడ్లు, నిమ్మరసం ద్రావణం మొక్క ఆ రోగ్యంగా పెరుగుటకు కావలసిన ప్రోటీన్లను అందిస్తుందన్నారు. ఈ ద్రావణాన్ని పంటలలో పిచికారీ చేయడం వలన పంటల నాణ్యత పెరుగుతుంది అని చెప్పారు.

ఆర్టీసీ బస్సులో 40 కాసుల బంగారం చోరీ

ఉండి జూలై 29: ఆంధ్రాలోని చుట్టాల ఇంటికి ఫంక్షన్‌కు విచ్చేసి తెలంగాణ వెళ్లిపోతున్న కుటుంబ సభ్యులకు చేదు అనుభవం చోటుచేసుకుంది. ఉప్పులూరు గ్రామంలోని ఒక ఫంక్షన్‌కు భార్యభర్తలిరువురు విచ్చేశారు. ఫంక్షన్ పూర్తికావడంతో తిరిగి వారు తెలంగాణ రాష్ట్రం ఖమ్మం వెళ్లిపోవడానికి మండలంలోని కోలమూరు బస్‌స్టాప్‌కు విచ్చేసి జంగారెడ్డిగుడెం బస్‌ను ఎక్కారు. వీరితోపాటు ఇరువురు మహిళలు అదే బస్సును ఎక్కారు. వారు ఎక్కిన దగ్గర నుంచి వీరిని ఇబ్బందికి గురిచేసినట్లు చెబుతున్నారు. ఉంగుటూరు మండలం నారాయణపురం వెళ్లేసరికి బ్యాగ్ చూసుకునే సరికి బ్యాగ్‌లోని సుమారుగా 40కాసుల బంగారం మాయమైనట్లు గుర్తించారు.

మానవ అక్రమ రవాణా అరికట్టాలి

తణుకు, జూలై 29: దేశంలో మానవ అక్రమ రవాణాను అరికట్టాలని న్యాయవాది కౌరు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం పట్టణంలోని ఎనిమిదో వార్డులో బార్ అసోసియేషన్, పారా లీగల్ వలంటీర్ల ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్లకు చట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామాలలో చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు.